Follow: @ANNTELUGU
07-07-2026

# మహా పత్రిక

ANN తెలుగు

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 183 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఇంట్లో బంగారంపై కేంద్రం కన్ను

**ఇకపై గోల్డ్ షాపుల్లోనే దాచుకొనే స్కీం రాబోతుందా?**

**ఢిల్లీ, మహా :** ఇళ్లల్లో నిరుపయోగంగా పడి ఉన్న బంగారాన్ని దేశీయ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఒక సరికొత్త వ్యూహాన్ని రచిస్తోంది. ప్రతిష్టాత్మకమైన 'గోల్డ్ మోనిటైజేషన్ స్కీమ్' లో కీలక మార్పులు చేస్తూ, దేశంలోనే మొదటిసారిగా స్థానిక బంగారు వ్యాపారులను ఈ పథకంలో భాగస్వాములుగా చేర్చాలని భావిస్తోంది. బ్యాంకులతో పోలిస్తే సామాన్య ప్రజలకు జ్యువెలర్లతోనే ఎక్కువ పరిచయం, నమ్మకం ఉంటాయి కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ పథకానికి కేవలం ప్రక్రియే అడ్డంకి కాదు, ప్రజల్లో ఉన్న 'ప్రభుత్వ పన్నుల భయమే' అసలైన

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### రేవంత్ సర్కార్ రికార్డు

- రెండేళ్ళలో 23వేల కోట్ల రైతు భరోసా పంపిణీ

02



### అసెంబ్లీ సెలెక్ట్ కమిటీ ఛైర్మన్ గా మంత్రి పొన్నం

- జాయింట్ కమిటీ ఛైర్మన్ గా కడియం

02



### నీరవ్ మోదీకి షాక్ భారత్‌కు అప్పగింత

- యూరోపియన్ కోర్టులో అప్పీల్ తిరస్కరణ
- భారత్‌కు అప్పగింతకు మార్గం సుగమం
- సీబీఐ, ఈడీకి భారీ ఊరట

02

అంతర్జాతీయ

## టూరిజం హబ్‌గా తెలంగాణ

- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- వికారాబాద్ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన





**హైదరాబాద్, మహా :** తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ లోని బోధి పెవిలియన్‌లో పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తారామతి బారామతిని టూరిజం ప్లేస్‌గా మరింత గా అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును మిగతా 2వ పేజీలో



## బిల్డర్ల అరాచకం

**ఆక్రమించిన స్థలం రూ. 100కోట్ల పై మాటే**

**ప్రభుత్వ భూమి దురాక్రమణ**

శేరిలింగంపల్లి మండలం , ఖానామెట్ పరిధిలో బిల్డర్ల అరాచకం పరాకాష్టకు చేరింది. ఐటీ హబ్ హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అక్రమార్కులు చెరబట్టారు. సర్వే నంబర్లు 11/33, 11/34 లలో 4 వేల చదరపు గజాల భూమి గల్లంతయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు . మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి సుమారు రూ. 100 కోట్లకు పై మాటే ఉంటుందని బహిరంగ చర్చ జరుగుతోంది. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాల పై అక్రమార్కుల కన్ను పడటం తో అదే అదునుగా భావించి అధికారులతో కుమ్మక్కై దురాక్రమణకు తెగబడుతున్నారు. చట్టాలు, కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతూ అక్కడ భారీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని రాకెట్ వేగంతో చేపట్టడం తీవ్ర కలకలం రేపుతోంది.ఇంత బహిరంగంగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా.. సంబంధిత టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున "ముడుపుల ముట్టాయనే" ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

02


- సర్వే నెంబర్లు 11/33,11/34 గల్లంతు
- 4వేల చదరపు గజాల భూమి గోల్ మాల్
- 22(ఏ)లో యథేచ్ఛగా
- కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు
- కోర్టు పరిధిలో ఉన్నా లెక్కచేయని అక్రమార్కులు
- రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల అండ..
- అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు వెల్లువ
- మహా కథనానికి అక్రమార్కుల గుండెల్లో గుబులు.

## చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కొత్త మలుపు

- పాప కనపడకుండా పోయిన రోజున కనిపించిన కియా కారు మళ్లీ ప్రత్యక్షం
- అదే కారు తమ బంధువును ఢీకొట్టిందని కుటుంబ సభ్యుల ఆరోపణ
- నెలరోజులుగా లభించని ఆచూకీ

02





## ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్

**బెంగళూరు, చెన్నై వెనక్కి**

- దక్షిణాదిలో రూ.11,246 కోట్లకు చేరిన లగ్జరీ గృహాల విక్రయాలు
- ఈ అమ్మకాలలో రూ.8,562 కోట్లతో హైదరాబాద్ అగ్రస్థానం

02






## భారత్‌కు జపాన్ టెక్నాలజీ..

- నౌకా దళానికి కొత్త బలం
- స్టెల్త్ సామర్థ్యం పెంచే ఇంటిగ్రేటెడ్ మాస్ట్
- భారత్-జపాన్ రక్షణ సహకారంలో కీలక అడుగు

07


## మణుగూరులో అత్యాధునిక పోలీస్ స్టేషన్ ప్రారంభం

- మాదకద్రవ్యాల నిర్మూలనపై ఉక్కుపాదం
- డీజీపీ సీవీ ఆనంద్

02




# బిల్డర్ల అరాచకం










**స్పెషల్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ మహా :**

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం కూకట్పల్లి జోనల్ పరిది ఖానామెట్ లో బిల్డర్ల అరాచకం రాజ్యమేలుతుంది.సర్వే నెంబర్లు 11/33, 11/34 లలో ఉన్న సుమారు 4 వేల చదరపు గజాల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమార్కులు దురాక్రమణకు తెగబడ్డారు . ఈ వివాదాస్పద భూమి అత్యంత కీలకమైన 22(A) (రిజిస్ట్రేషన్ నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉంది. అంతేకాకుండా, ఈ స్థలానికి సంబంధించి కోర్టు పరిధిలో స్పష్టమైన వివాదం నడుస్తోంది. చట్టప్రకారం ఇక్కడ ఎలాంటి కొనుగోళ్లు, అమ్మకాలు, ఎలాంటి నిర్మాణ పనులుగానీ చేపట్టడానికి వీల్లేదు. కానీ, కోర్టు ఆదేశాలను, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమార్కులు ఇక్కడ రాత్రికి రాత్రే బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాల నిర్మాణాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. భారీ కాంక్రీట్ మిక్సర్లు, వందలాది మంది కార్మికులతో పనులు ఇక్కడ శరవేగంగా సాగిస్తున్నారు.


**రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల అండ!**


హైటెక్ సిటీ నుంచి కూకట్పల్లి ప్రధాన రహదారి పక్కన బుట్టా కన్వెన్షన్ ఆనుకుని వందల కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం అక్రమార్కుల పాలయింది. ఇంత బహిరంగంగా కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆస్తి దరాక్రమణకు గురి అవుతుంటే అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పత్తాలేకుండా పోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న 'అంతరార్థం' ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ఒక సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా వంద నిబంధనలు పెట్టి వేధించే టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, ఈ భారీ అక్రమ కట్టడాల వైపు ఎందుకు చూడటం లేదన్నది బహిరంగ రహస్యమే అని స్థానికులు పేర్కొంటున్నారు . అధికారుల పూర్తి అండదండలు, ముడుపుల మౌనం వల్లే ఈ అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

## 'ప్రజావాణి'లో ఫిర్యాదుల వెల్లువ..

ఈ అక్రమ కట్టడాలపై సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆంజనేయులు, భాస్కర్ సారథ్యంలో స్థానికులతో కలసి రెవెన్యూ అధికారులకు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కి ఫిర్యాదులు చేసారు. అధికారిక రికార్డులు, ఫోటోలు, క్షేత్రస్థాయి ఆధారాలతో సహా వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయి అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై తక్షణమే విచారణకు ఆదేశాలు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తుండటంతో
ఇన్నాళ్లూ అధికారుల అండతో రెచ్చిపోయిన కబ్జాదారులకు, ఇప్పుడు ఈ వ్యవహారం ప్రజావాణి వేదికగా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం.. దానికి తోడు 'మహా కథనం' రూపంలో వారి అక్రమాల పుట్ట బద్దలు కావడంతో వారి గుండెల్లో వణుకు మొదలైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు లంచగొండి అధికారులపై, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న అక్రమ నిర్మాణదారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలని శేరిలింగంపల్లి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.










# అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ

**( మొదటి పేజీ తరువాయి )**


పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంజీరా, దిల్ కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునీకరించాలన్నారు. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయయడంతో ఈ ఆలయానికి యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పర్యావరణహిత పర్యాటకానికి ప్రాధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని అధికారులకు తెలిపారు.



# ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్

**హైదరాబాద్, మహా :** దక్షిణ భారతదేశంలోని మూడు ప్రధాన నగరాల్లో అల్ట్రాలగ్జరీ గృహాల మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. 202526 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో రూ.10 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన 811 విలాసవంతమైన ఇళ్లు అమ్ముడయ్యాయి. వీటి మొత్తం అమ్మకాల విలువ రూ.11,246 కోట్లుగా నమోదైంది. ఈ వివరాలను 'సదరన్ ఇండియా హైఎండ్ లగ్జరీ హౌసింగ్' పేరుతో ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ, సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ విక్రయాల్లో హైదరాబాద్ నగరం స్పష్టమైన ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క హైదరాబాద్‌లోనే 625 లగ్జరీ ఇళ్లు అమ్ముడుపోగా, వాటి విలువ రూ.8,562 కోట్లుగా ఉంది. హైదరాబాద్ తర్వాత బెంగళూరులో 128 ఇళ్ల అమ్మకాల ద్వారా రూ.1,957 కోట్లు, చెన్నైలో 58 ఇళ్ల విక్రయాల ద్వారా రూ.727 కోట్ల వ్యాపారం జరిగింది. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో తక్కువ ధరకే ఎక్కువ స్థలం లభించడం ఈ వృద్ధికి కీలక కారణంగా కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.10 కోట్లతో హైదరాబాద్‌లో సుమారు 6,210 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కొనుగోలు చేయగలిగితే, అదే మొత్తానికి చెన్నైలో 4,290 చదరపు అడుగులు, బెంగళూరులో కేవలం 3,930 చదరపు అడుగుల స్థలం మాత్రమే లభిస్తోంది. హైదరాబాద్‌లోని కోకాపేట, బెంగళూరులోని రాజనుకుంటె ప్రాంతాలు అల్ట్రాప్రీమియం ప్రాజెక్టులకు హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి. ఈ నివేదికపై ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ సీఈఓ అశ్విన్ చద్దా మాట్లాడుతూ, "దక్షిణ భారతదేశంలోని లగ్జరీ గృహాల మార్కెట్ మూడు విభిన్న నగరాల ప్రత్యేకతలతో రూపుదిద్దుకుంటోంది. అమ్మకాల పరిమాణంలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుండగా, బెంగళూరు వేగవంతమైన వృద్ధి సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. మరోవైపు చెన్నై తన పాత, ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ప్రాంతాలపై ఆధారపడి స్థిరంగా కొనసాగుతోంది," అని వివరించారు.


# చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కొత్త మలుపు



**కాకినాడ, మహా :** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారంలో తీవ్ర కలకలం రేపిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు కొత్త మలుపు తిరిగింది. దాదాపు నెల రోజులుగా ఆచూకీ లేకుండా పోయిన ఈ కేసులో, తాజాగా ఓ అనుమానాస్పద కారుపై పోలీసుల దృష్టి పడింది. ఈ పరిణామంతో దర్యాప్తు మరో కోణంలో వేగవంతమైంది. వివరాల్లోకి వెళితే, సుంకర గణేశ్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి (2) జూన్ 6న వారు పనిచేస్తున్న పామాయిల్ తోటలో ఆడుకుంటూ అదృశ్యమైంది. అప్పటి నుంచి పోలీసులు గాలిస్తున్నా చిన్నారి జాడ తెలియరాలేదు. అయితే, పాప అదృశ్యమైన రోజున ఓ కియా కారు అనుమానాస్పదంగా సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. ఇప్పుడు గత రెండు రోజులుగా అదే కారు మళ్లీ ఆ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
నర్సీపట్నం సమీపంలో తమ బంధువుల్లో ఒకరిని అదే కారు ఢీకొట్టిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు, ఈ కొత్త కోణంపై లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. అనుమానిత కారు వివరాలు, దాని కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

## తెలంగాణ సచివాలయంలో నిలిచిపోయిన క్యాటరింగ్ సేవలు

**హైదరాబాద్, మహా :**
తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఉండే ఫ్లోర్ కు క్యాటరింగ్ సేవలు నిలిచిపోయాయి. గత రెండేళ్లుగా కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో ఆయన సరఫరాను నిలిపివేశారు. ఈ పరిణామంతో సచివాలయంలోని ఉన్నతాధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయంలోని ఆరో అంతస్తులో ఉండే ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కార్యాలయాల సిబ్బందితో పాటు ఇతర ఉన్నతాధికారులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఫలహారాలు అందించే సేవలకు అంతరాయం ఏర్పడింది. పేరుకుపోయిన బకాయిలను కనీసం వాయిదాల పద్ధతిలోనైనా విడుదల చేయాలని కాంట్రాక్టర్ పలుమార్లు విన్నవించినప్పటికీ, అధికారులు స్పందించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ బకాయిలు కోట్ల రూపాయల్లో ఉండటంతో ముడిసరుకులు కొనుగోలు, సిబ్బంది జీతాల చెల్లింపు భారంగా మారి కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు సమాచారం. రాష్ట్రంలో వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆందోళనల నడుమ ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వంటి సీనియర్ నేతల హామీతో కాంట్రాక్టర్లు తమ నిరసనలను వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికే ఆహార సరఫరా నిలిచిపోవడం గమనార్హం.



# ఇంట్లో బంగారంపై కేంద్రం కన్ను

**( మొదటి పేజీ తరువాయి )**

సమస్య అని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. బంగారం డిపాజిట్ చేస్తే ఎక్కడ ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కన్ను పడుతుందో, తమ సంపాదనపై ఎక్కడ పన్ను ప్రశ్నలు అడుగుతుందో అనే ఆందోళనలు చాలా మందిలో ఉన్నాయి. దీనివల్ల ఈ రకమైన సంస్కరణలు కూడా ఆశించిన మేర ఫలితాన్ని ఇవ్వడం కష్టమేనని ఆర్థిక శాఖ వర్గాలు అంగీకరిస్తున్నాయి. గోల్డ్ మోనిటైజేషన్ స్కీమ్ కింద ప్రజలు తమ వద్ద ఉన్న బంగారాన్ని బ్యాంకులలో డిపాజిట్ చేసి, సురక్షితంగా వడ్డీని సంపాదించవచ్చు. కానీ, 2015 లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి నవంబర్ 2025 నాటికి కేవలం 39 టన్నుల బంగారం మాత్రమే మార్కెట్లోకి వచ్చింది. నిజానికి మన దేశంలోని ఇళ్లల్లో సుమారు 25,000 నుంచి 30,000 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయని అంచనా. ఈ అపారమైన నిల్వలతో పోలిస్తే పథకం సాధించిన విజయం చాలా స్వల్పమని అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. స్థానిక గోల్డ్ షోరూమ్‌లకు ఈ డిపాజిట్లను సేకరించే అధికారం ఇవ్వడం వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పథకం మరింత వేగంగా దూసుకుపోతుందని అధికారులు విశ్వసిస్తున్నారు. సౌకర్యవంతమైన కొత్త మార్పులు తీసుకురావడం ద్వారా నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని బయటకు తీసేందుకు జ్యువెలర్లను భాగస్వాములను చేయడం మంచి పరిణామమే. అయితే, కేవలం సదుపాయాలు పెంచితే సరిపోదు; ఐటీ తనిఖీల భయం నుంచి డిపాజిటర్లకు పూర్తి క్లీన్ చిట్ లేదా ఒక నిర్దిష్టమైన రక్షణ కల్పించే విధానాన్ని తీసుకురావాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



## నీరవ్ మోదీకి షాక్ భారత్‌కు అప్పగింత

**ఢిల్లీ,మహా :** పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని కటకటాల్లోకి నెట్టేందుకు భారత ప్రభుత్వానికి భారీ విజయం దక్కింది. బ్రిటన్ నుంచి తనను భారతదేశానికి అప్పగించడాన్ని సవాల్ చేస్తూ ఆయన పెట్టుకున్న చివరి ఆశల దరఖాస్తు కూడా తిరస్కరణకు గురైంది. ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే అత్యున్నత సంస్థ 'యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్' నీరవ్ మోదీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. దీంతో ఆయనకు అంతర్జాతీయంగా ఉన్న అన్ని న్యాయపరమైన రక్షణ దారులు పూర్తిగా మూసుకుపోయాయి. తాజా పరిణామంతో నీరవ్ మోదీని లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలు నుండి భారత్‌కు తీసుకొచ్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ , ఈడీ లకు ఉన్న అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. లండన్ హోం శాఖ అధికారిక ఉత్తర్వుల అనంతరం త్వరలోనే ఆయనను ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలుకు తరలించే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## అసెంబ్లీ సెలెక్ట్ కమిటీ చైర్మన్ గా మంత్రి పొన్నం

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేసింది. సెలెక్ట్ కమిటీ చైర్మన్‌గా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాలను పరిశీలించే ఈ కమిటీలో 13 మంది సభ్యులు ఉండనున్నారు. జాయింట్ కమిటీకి కడియం శ్రీహరి చైర్మన్‌గా ఎంపికయ్యారు. 11 మంది సభ్యులు, చైర్మన్‌తో జాయింట్ కమిటీ పనిచేయనుంది. ఎస్సీ సంక్షేమం కమిటీ చైర్మన్‌గా మేడిపల్లి సత్యంను ఎంపిక చేశారు. 11 మందితో కూడిన సభ్యుల బృందం ఈ కమిటీ విధుల్లో పాలుపంచుకోనుంది.

## రేవంత్ సర్కార్ రికార్డు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు అండదండగా ఉండడానికి అన్ని విధాలా చర్యలు చేపడుతుంది. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం పంట పెట్టుబడిసాయం అందించే రైతు భరోసా విషయంలో సరికొత్త మైలురాయిని అధిగమించింది. గత బీ ఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వంలో రైతుబంధుగా ప్రారంభమైన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం రైతు భరోసాగా కొనసాగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం పరిధిని మరింత విస్తృతం చేయడంతో కౌలు రైతులను, వ్యవసాయ కూలీలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయడంతో ప్రస్తుతం ఈ పథకంలో లబ్ధిదారుల సంఖ్య 73లక్షల మార్కును చేరుకుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లకాలంలో 50,250 కోట్ల రూపాయలు పంపిణీ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు తక్కువ కాలంలోనే 23,070 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు విడుదల చేసింది. ఇందులో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 9 లక్షల మంది నిరుపేద వ్యవసాయ కూలీలను సైతం చేర్చి వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు కూడా లబ్ధి చేకూరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పైన ఈ పథకానికి సంబంధించిన ఆర్థిక భారం పెరిగినప్పటికీ రైతు సంక్షేమం కోసం ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా నల్గొండ జిల్లాకు 5, 491 కోట్లు గరిష్ట నిధులు అందాయి.





# అసెంబ్లీలో 11 కమిటీల నియామకం

**ఎస్టీ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ గా పాయం వెంకటేశ్వర్లు**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేసింది. సెలెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాలను పరిశీలించే ఈ కమిటీలో 13 మంది సభ్యులు ఉండనున్నారు. జాయింట్ కమిటీకి కడియం శ్రీహరి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. అసెంబ్లీ నిర్వహణకు వివిధ కమిటీలన్నీ నియమించారు.

| ఉమ్మడి కమిటీలు |
|---|
| సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ - కడియం శ్రీహరి |
| అమెనిటీస్ కమిటీ - సభాపతి, |
| తెలంగాణ శాసనసభ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ - మేడిపల్లి సత్యం |
| షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ - పాయం వెంకటేశ్వర్లు |
| వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ - మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ |
| గ్రంథాలయ కమిటీ - డా. మట్టా రాగమయి |
| మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ కమిటీ - శ్రీమతి చిట్టెం పర్ణికా రెడ్డి |
| మైనారిటీల సంక్షేమ కమిటీ - లక్ష్మీకాంతరావు తోట |
| వన్యప్రాణులు మరియు పర్యావరణ పరిరక్షణ కమిటీ - సభాపతి, తెలంగాణ శాసనసభ |
| **శాసనసభ కమిటీలు** |
| పిటిషన్స్ కమిటీ - ఉప సభాపతి, తెలంగాణ శాసనసభ |
| ప్రివిలేజెస్ కమిటీ - ఉప సభాపతి, |
| తెలంగాణ శాసనసభ ప్రభుత్వ హామీల కమిటీ - పట్లోళ్ల సంజీవ రెడ్డి |
| రూల్స్ కమిటీ - సభాపతి, |
| తెలంగాణ శాసనసభ ఎథిక్స్ కమిటీ - రేవూరి ప్రకాశ్ రెడ్డి |
| **శాసనమండలి కమిటీలు** |
| పిటిషన్స్ కమిటీ - ఉప ఛైర్మన్, తెలంగాణ శాసనమండలి |
| ప్రివిలేజెస్ కమిటీ - ఉప ఛైర్మన్, తెలంగాణ శాసనమండలి |
| ప్రభుత్వ హామీల కమిటీ - కేతావత్ శంకర్ |
| రూల్స్ కమిటీ - ఛైర్మన్, తెలంగాణ శాసనమండలి సభ |
| ముందుంచిన పత్రాల కమిటీ - చల్లా వెంకట్రాం రెడ్డి |
| ఎథిక్స్ కమిటీ - మహేష్ కుమార్ గౌడ్ బొమ్మ |

# మణుగూరులో అత్యాధునిక పోలీస్ స్టేషన్ ప్రారంభం

**మాదకద్రవ్యాల నిర్మూలనపై ఉక్కుపాదం**
**డీజీపీ సీవీ ఆనంద్**



**మణుగూరు, మహా :** మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఈ రోజు డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. పదేళ్ల క్రితమే పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ, నిధుల కొరతతో వాయిదా పడుతూ వచ్చిన ఈ నిర్మాణాన్ని సింగరేణి సంస్థ, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం మరియు భాగస్వాముల సమిష్టి కృషితో పూర్తి చేసినట్లు డీజీపీ వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ భవనాన్ని పరిశీలించిన అధికారులకు, అందులో ఏర్పాటు చేసిన మిని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ మరియు ఆధునిక సదుపాయాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో జరిగిన సమావేశంలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగంపై దృష్టి

సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీలు, సంఘ వ్యతిరేక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. ఆధునిక సాంకేతికత, ముఖ్యంగా కృత్రిమ మేధస్సును విరివిగా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. నేర పరిశోధనలో సమర్థత పెంచేందుకు సి.సి.టి.ఎన్.ఎస్ 3.0 లో సమాచారాన్ని సకాలంలో నమోదు చేయడం అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. మెరుగైన మౌలిక వసతులు ఫిర్యాదుదారుల్లో విశ్వాసాన్ని నింపడమే కాకుండా, సిబ్బందికి అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పిస్తాయని సందర్శకుల పుస్తకంలో నమోదు చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో హోంగార్డు నుంచి పోలీస్ బాస్ వరకు ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉక్కు సంకల్పంతో పనిచేయాలని డీజీపీ పిలుపునిచ్చారు. భావి తరాలను ఈ మహమ్మారి నుంచి కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల విక్రేతలు, సాగుదారులను నక్సలైట్ల కంటే ప్రమాదకరమైన వ్యక్తులుగా గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి, రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన ఏసీబీ

**రూ. 300 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు**

హైదరాబాద్, మహా : తెలంగాణ పోలీస్ శాఖలో అవినీతి తిమింగలాల వేటను అవినీతి నిరోధక శాఖ మరింత ముమ్మరం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సంకిరెడ్డి భీమ్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేశారు. సోదాల సమయంలో ఆస్తుల చిట్టా బయటపడటంతో భీమ్‌రెడ్డి బీపీ ఒక్కసారిగా పెరగడంతో ఆయనను తొలుత ఆసుపత్రికి తరలించారు. వైద్యుల నివేదిక, ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం, ఆరోగ్య పరిస్థితి కుదుటపడటంతో ఆయనను ఏసీబీ అధఇకారులు అధికారికంగా అదుపులోకి తీసుకున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన అధికారులు, భీమ్‌రెడ్డిని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచారు. కానిస్టేబుల్‌గా కెరీర్ ప్రారంభించి డీఎస్పీ స్థాయికి ఎదిగిన భీమ్‌రెడ్డి, ఇంత పెద్ద మొత్తంలో అక్రమాస్తులు వెనకేయడం పోలీస్ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

**నాలుగు రోజుల క్రితం సుదీర్ఘ సోదాలు**

నాలుగు రోజుల క్రితం (గురువారం) తెల్లవారుజాము నుంచే డీఎస్పీ భీమ్‌రెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలకు చెందిన మొత్తం 16 ప్రాంతాల్లో ఏసీబీ ఏకకాలంలో ఆకస్మిక సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని నార్సింగి, ఇబ్రహీంబాగ్‌లోని లగ్జరీ విల్లా, గచ్చిబౌలి, టెలికాం నగర్, మణికొండలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాలలో భీమ్‌రెడ్డి సంపాదించిన విస్తుపోయే అక్రమాస్తులు బయటపడ్డాయి. లగ్జరీ విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో వాటాలు, ఐటీ కారిడార్‌లో ఖరీదైన ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్లతో పాటు కర్ణాటకలోని దేవనహళ్లి, ఇతర ప్రాంతాలలో దాదాపు 45 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటికి అదనంగా, డీఎస్పీ ఇంటి నుంచి, బినామీ ఇళ్ల నుంచి రూ. 43.6 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలు, 20 కేజీల వెండి వస్తువులను అదుపులోకి తీసుకున్నారు. సోదాల సమయంలో లభించిన 23 విదేశీ మద్యం సీసాలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కేసు నమోదు చేసింది.





భార్యకు వీడియో కాల్‌లో చూపిస్తూ

# రైలు కింద పడి భర్త ఆత్మహత్య

**కాజీపేట, మహా :** వరంగల్ జిల్లా కాజీపేట సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యతో వీడియో కాల్‌లో మాట్లాడుతూనే ఎదురుగా వస్తున్న రైలు కింద పడి రాజేశ్ నాయక్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. రాజేశ్ వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా భార్య, తల్లిదండ్రుల మధ్య ఆస్తి వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి భార్యతో మరోసారి గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన రాజేశ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు.తర్వాత రైల్వే పట్టాల వద్దకు చేరుకుని భార్యకు వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి, ఎదురుగా వస్తున్న రైలు కింద పడ్డాడు. అయితే అతడు కేవలం భయపెడుతున్నాడని భావించిన భార్య దీనిని సీరియస్‌గా తీసుకోలేదు.రాత్రంతా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. సోమవారం ఉదయం కాజీపేట సమీపంలోని రైల్వే పట్టాలపై ఉన్న మృతదేహం రాజేశ్‌దేనని గుర్తించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# చెల్లెలి నిశ్చితార్థం నుంచి వస్తూ విషాదం

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దగోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం.. చెల్లెలి నిశ్చితార్థ కార్యక్రమం కోసం ఏర్పల్లి గ్రామానికి వెళ్లిన రాఘవేంద్ర ప్రసాద్, మనోహర్, భవాని, కార్తికేయ టీఎస్07 జేబీ 5801 నంబర్ కారులో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. రాఘవేంద్ర ప్రసాద్ కారు నడుపుతుండగా, మనోహర్ ముందు సీటులో, భవాని, కార్తికేయ వెనుక సీటులో కూర్చున్నారు.పెద్దగోల్కొండ ఓఆర్ఆర్ ఎక్స్‌టెన్షన్ 15 వద్ద రెండో లేన్‌లో వెళ్తుండగా, అదే లేన్‌లో ముందుగా వెళ్తున్న గుర్తుతెలియని లారీ ఒక్కసారిగా వేగం తగ్గించింది. దీంతో కారు అదుపుతప్పి లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న మనోహర్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న రాఘవేంద్ర ప్రసాద్‌తో పాటు భవాని ముఖం, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కార్తికేయ కూడా గాయపడగా, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఎనుమాముల ఈవీ ఎం గోదాంను తనిఖీ

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** నెలవారీ తనిఖీ షెడ్యూల్ లో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద సోమవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్ లోని ఈవీఎం గోదాము ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎం ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణను పర్యవేక్షించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా భారత ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, కలెక్టరేట్ సూపర్డెంట్ రజిని ఖిలా వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల విభాగ అధికారులు, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు.




# ప్లైదీల్ హైదరాబాద్ రియాద్ విమాన సర్వీసులు ప్రారంభం...

**రాజేంద్రనగర్ మహా ;** సౌదీ గ్రూప్ కు చెందిన తక్కువ ధరల విమానయ సంస్థ ప్లైదీల్ తొలి హైదరాబాద్, రియాద్ విమాన సర్వీసును శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జీఎంఆర్, ఎయిర్ లైన్స్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ ఎయిర్‌లైన్ ప్లైదీల్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రియాద్‌కు ప్రతిరోజూ నేరుగా నడిచే విమాన సర్వీసులను సోమవారం ప్రారంభమయ్యాయి.ప్రతిరోజు 11.20 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 7.55 గంటలకు బయలుదేరి, రియాద్ కు ఉదయం 11.5 చేరుకుంటుంది.శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ సీఈవో శ్రీ కదిర్ కదిరవన్ మాట్లాడుతూదీని ద్వారా హైదరాబాద్‌కు సౌదీ అరేబియా ప్రాంతంతో అనుసంధానం మరింత బలపడింది. పర్యాటకులు, వ్యాపారవేత్తలకు, ప్రవాస భారతీయులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో పాడి గేదె మృతి



కారేపల్లి, మహా: విద్యుద్ఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం చర్లపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు ఉన్నం నాగేశ్వరరావు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. చర్లపల్లికి చెందిన పాడి గేదెలు సోమవారం మేతకు వెళ్ళి ఇంటికి తిరిగి వచ్చాయి. వాటిలో ఇంటి అవరణలో ఉన్న కోయ గుంజలకు కట్టివేశారు. కోయగుంజకు అనుకోని ఇనుప కడ్డి ఉంది. దాని పైనుండి ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే సర్వీస్ వైరును లాగారు. పాడి గేదెను ఇనుప కడ్డి అనుకోని ఉన్న గుంజ కు కట్టివేశారు. ఇనుప కడ్డికి కి సర్వీస్ వైరు జీ వైరు నుండి విద్యుత్ సరఫరా అయి పాడి గేదెకు విద్యుత్ షాక్ తగలింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీనికి సంబంధించి బాధిదు ఉన్నం నాగేశ్వరారవు విద్యుత్ అధికారులకు, పశువైద్యాధికారులకు పిర్యాదు చేశారు.

# ఖైరతాబాద్‌లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమీక్షించిన బిఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి



**ఖైరతాబాద్, మహా :** ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి అధికారులకు సూచించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం, ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని తాత నగర్‌లో నిశాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మన్నె గోవర్ధన్ రెడ్డి, ఓటరు నమోదు మరియు సవరణల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం సూపర్వైజర్ వెంకటేష్, 77వ డివిజన్ బూత్ స్థాయి అధికారి మౌనిక, 78వ డివిజన్ బూత్ స్థాయి అధికారి సంఘమిత్రలతో పాటు బూత్ స్థాయి ఏజెంట్లు దస్తగిరి , భరత్‌లతో కలిసి ఓటరు జాబితాల ప్రత్యేక పరిశీలన ప్రక్రియను మన్నె గోవర్ధన్ రెడ్డి సమీక్షించారు. ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని అధికారులను కోరారు. అలాగే, నియోజకవర్గ ప్రజలందరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకొని, అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, బాలరాజు యాదవ్, క్రాంతి, ప్రభాకర్ రెడ్డి, బిట్ల శ్రీనివాస్ రాజ్, రోహిత్ కుమార్, రావుల విజయ్ కుమార్, శ్రీధర్ మరియు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గోడ పత్రాలు విడుదల




**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కలెక్టర్ భవన కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బృందం నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డి.ఎం. హెచ్.ఓ. మాట్లాడుతూ ఈ నెల 13 నుండి జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 19 సంవత్సరాలు వయస్సు గల పిల్లలందరికీ మాత్రలను అందజేయాలని ఆయన కోరారు. జిల్లాలోని 930 అంగన్వాడీ కేంద్రాలలో పేర్లను నమోదు చేసుకున్న వారికి, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులందరికీ ఆల్బెండ జోళ్ళు అందజేసి తినిపించాలని ఆయన ఆదేశించారు. మంచిర్యాల జిల్లాలో 1 లక్ష 58 వేల 480 మంది పిల్లలకు మాత్రలు, గుళికలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. వివిధ మండలాలలో ఉన్న ఆశ ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న పిల్లల తల్లులకు, పాఠశాలల విద్యార్థులకు, పోషక ఆహార లోపం కలిగిన వారికి, రక్తహీనత, శరీరక పెరుగుదల లేనివారికి మాత్రలు పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు సగం టాబ్లెట్ ఇవ్వాలన్నారు. మూడు సంవత్సరాల పిల్లలకు ఒక టాబ్లెట్ పొడిచేసి తాగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్. ఎం ఓ డాక్టర్ భీష్మ, శ్రీధర్, రవి, సుధాకర్ నాయక్, అరుణ శ్రీ, అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, రషీద్, ఆర్ఎస్ పద్మ, డిపిఓ ప్రశాంతి, సుమన్, నరేందర్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు వైద్య బృందం నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గోడపత్రాలను, కరపత్రాలను విడుదల చేశారు.


అంజనాపురంలో

# గ్రంథాలయ ప్రారంభం

**తల్లాడ, మహా:** ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని అంజనాపురం గ్రామంలో క్రీస్తుశేషులు కేతినేని చలమయ్య, భద్రమ్మ కుమారుడు కేతినేని బాబు జ్ఞాపకార్థం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సోమవారం టీడీపీ రాష్ట్ర నాయకుడు కేతినేని హరీష్ చంద్ర, సర్పంచ్ రాధాకృష్ణయ్య, ఉప సర్పంచ్ కేతినేని చలపతిరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "గ్రంథాలయాలే జ్ఞాన దేవాలయాలు" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని దినపత్రికలు, పుస్తకాలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కిన్నెర వెంకటేశ్వరరావు, కేతినేని వీరరామారావు, కేతినేని వెంకటరామారావు, అనుములు రాంబాబు, చందా వెంకటేశ్వర్లు, భూక్యా బాబు, బంటి భూక్యా, వంశీ, అఖిల్, గోపి, అశోక్, చంద్రయ్య, నాగయ్య, తేజావత్ రాంబాబుతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోహన్‌లాల్ ఏనుగు దంతాల కేసు.. కొత్త మలుపు తిరిగిన వివాదం

మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్‌కు సంబంధించిన ఏనుగు దంతాల (ఐవరీ) కేసు మరోసారి వార్తల్లో నిలిచింది. దశాబ్దానికి పైగా కొనసాగుతున్న ఈ న్యాయ వివాదంలో తాజాగా ఆయన ప్రభుత్వం ప్రకటించిన వైల్డ్‌లైఫ్ అమ్నెస్టీ పథకం కింద తన వద్ద ఉన్న ఐవరీ వస్తువుల వివరాలను అధికారికంగా వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. ఈ తాజా పరిణామం కేసు విచారణపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై న్యాయ, సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.మోహన్‌లాల్ సమర్పించిన వివరాల ప్రకారం, తన వద్ద మొత్తం 10 ఏనుగు దంతాలు తో పాటు వాటితో రూపొందించిన 13 ఐవరీ విగ్రహాలు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో హిందూ దేవతల విగ్రహాలు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ వస్తువులన్నీ తనకు కుటుంబ వారసత్వంగా లేదా బహుమతుల రూపంలో లభించాయని ఆయన గతంలోనూ వివరణ ఇచ్చారు. అలాగే వన్యప్రాణి సంబంధిత చట్టాల ప్రకారం అవసరమైన అనుమతుల గురించి పూర్తి అవగాహన లేదని ఆయన తరపు న్యాయవాదులు కోర్టులో వాదిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ కేసులో ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం ఐవరీ వస్తువుల ఉనికి కాదు, వాటి చట్టబద్ధమైన యాజమాన్యం. ఈ ఏనుగు దంతాలు ఎప్పుడు సేకరించబడ్డాయి? అవి చట్టబద్ధంగా పొందినవేనా? వాటికి సంబంధించిన యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అవసరమైతే ఐవరీ వస్తువులపై డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి వాటి మూలాన్ని నిర్ధారించే అవకాశాన్ని అటవీ శాఖ పరిశీలిస్తున్నట్లు సమాచారం.



ఈ వివాదం 2011లో ఆదాయపు పన్ను శాఖ మోహన్‌లాల్ నివాసంలో నిర్వహించిన సోదాల తర్వాత ప్రారంభమైంది. ఆ సమయంలో బయటపడిన ఏనుగు దంతాల ఆధారంగా అటవీ శాఖ కేసు నమోదు చేసింది. అనంతరం ప్రభుత్వం కొన్ని దశల్లో ఆయనకు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినప్పటికీ, ఆ ప్రక్రియపై న్యాయస్థానాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కేసు విచారణ కొనసాగించాలని కోర్టు స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు ప్రభుత్వం అమలు చేస్తున్న వైల్డ్‌లైఫ్ అమ్నెస్టీ పథకం కింద మోహన్‌లాల్ చేసిన స్వచ్ఛంద ఆస్తుల వెల్లడి ఆయనకు చట్టపరంగా ఎంతవరకు ఉపశమనం కలిగిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ పథకం ఉద్దేశం నమోదు కాని వన్యప్రాణి సంబంధిత వస్తువులను అధికారికంగా నమోదు చేయించడమే అయినప్పటికీ, ఇప్పటికే కోర్టు పరిధిలో ఉన్న కేసులపై దీని ప్రభావం ఎలా ఉంటుందనేది న్యాయస్థానం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది.ఒక ప్రముఖ నటుడికి సంబంధించిన కేసు కావడంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే సమయంలో వన్యప్రాణి సంరక్షణ చట్టాల అమలు, వారసత్వంగా లభించిన ఐవరీ వస్తువుల చట్టబద్ధత, ప్రభుత్వ అమ్నెస్టీ పథకాల పరిధి వంటి కీలక అంశాలపై భవిష్యత్తులో మార్గనిర్దేశం చేసే కేసుగా ఇది నిలిచే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సముద్ర తీరంలో గ్లామర్ ట్రీట్

బాలీవుడ్ యువ కథానాయిక, జెన్‌జీ స్టార్ అనన్య పాండే మరోసారి తన స్టైలిష్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సముద్ర తీరంలో సూర్యాస్తమయ వేళ నిర్వహించిన తాజా ఫొటోషూట్‌లో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. గోల్డెన్ అవర్ కాంతుల్లో మెరిసిపోయిన అనన్య ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. గ్లామర్, ఎలిగెన్స్, కాన్ఫిడెన్స్‌ను కలగలిపిన ఈ లుక్ మరోసారి ఆమెను ఫ్యాషన్ ఐకాన్‌గా నిలబెట్టింది.ఈ ఫొటోషూట్‌లో అనన్య పాండే బ్లాక్ కలర్ స్లీక్ బాడీసూట్‌ను ధరించి, దానికి ఆరెంజ్ బ్లాక్ డిజైన్‌తో కూడిన స్టైలిష్ మినీ ర్యాప్ స్కర్ట్‌ను జత చేసింది. సముద్రపు గాలికి అలలల్లా ఎగిరే జుట్టు, సహజమైన చిరునవ్వు, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించే పోజులు ఆమె లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తున్న సముద్రం, అస్తమిస్తున్న సూర్యుడి బంగారు కిరణాలు ఈ ఫొటోషూట్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఈ చిత్రాలను చూసిన అభిమానులు ఆమె స్టైల్‌ను ప్రశంసిస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.అనన్య పాండే 2019లో విడుదలైన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' చిత్రంతో బాలీవుడ్‌లో కథానాయికగా అడుగుపెట్టింది. టైగర్ ష్రాఫ్ సరసన నటించిన తొలి చిత్రంతోనే తన అందం, నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అనంతరం 'పతి పత్ని ఔర్ వో''ఖాలీ పీలీ'డ్రీమ్ గర్ల్ 2, అలాగే నెట్‌ఫ్లిక్స్ సిరీస్'కాల్ మీ బే'వంటి ప్రాజెక్టుల్లో విభిన్న పాత్రలు పోషించి నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా'ఖో గయే హమ్ కహా'చిత్రంలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా అనన్య పాండేకు భారీ ఫాలోయింగ్ ఉంది. ఫ్యాషన్ ఫొటోషూట్లు, ట్రావెల్ డైరీలు, ఫిట్‌నెస్ అప్‌డేట్లు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటుంది. ప్రతి కొత్త లుక్‌తో ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటూ యువతకు స్టైల్ ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తోంది. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఆమె మంచి గుర్తింపు పొందింది.ప్రస్తుతం అనన్య పాండే చేతిలో పలు బాలీవుడ్ ప్రాజెక్టులు ఉన్నాయి. కమర్షియల్ చిత్రాలతో పాటు కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. ఇక విజయ్ దేవరకొండ నటిస్తున్న 'రౌడీ జనార్ధన్' చిత్రంలో ఆమె ప్రత్యేక గీతంలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.తాజా సన్‌సెట్ ఫొటోషూట్‌తో మరోసారి తన గ్లామర్, స్టైల్, ఆత్మవిశ్వాసాన్ని చాటుకున్న అనన్య పాండే ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సినిమాలతో పాటు ఇలాంటి స్టైలిష్ ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తున్న ఆమె, రాబోయే ప్రాజెక్టులతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవాలని సిద్ధమవుతోంది.



ట్రెడిషనల్ లుక్‌లో

# పాయల్ షెనోయ్ మ్యాజిక్

దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి, మోడల్ పాయల్ రాధాకృష్ణ షెనోయ్ మరోసారి తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మెరూన్ రంగులో మెరిసే అత్యంత విలాసవంతమైన లెహంగా చోళీ ధరించిన పాయల్, రాజకుమారిలా కనిపిస్తూ సంప్రదాయ అందాలను ఆధునిక స్టైల్‌తో మేళవించింది. ఆమె ధరించిన లెహంగా చోళీపై సున్నితమైన బీడ్‌వర్క్, మెరిసే ఎంబెలిష్‌మెంట్స్, అందమైన ఫ్రింజ్ డిజైన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పారదర్శకమైన దుపట్టా ఆమె లుక్‌కు మరింత హుందాతనాన్ని జోడించింది. మెడలో విలువైన నెక్లెస్, చెవులకు సరిపోయే ఆభరణాలు, చేతులకు స్టైలిష్ యాక్సెసరీలు, అలలల్లాంటి జుట్టు, ఆకట్టుకునే మేకప్ కలిసి ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఒక చేతిని ముఖం వద్ద ఉంచి ఆత్మవిశ్వాసంతో ఇచ్చిన పోజ్ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఫొటోలో కనిపించే అద్దం ప్రతిబింబం మొత్తం ఫ్రేమ్‌కు మరింత వైభవాన్ని, కళాత్మకతను తీసుకొచ్చింది. ఈ అందమైన చిత్రాలను సోషల్ మీడియాలో పంచుకుంటూ పాయల్ సరదాగా **"లిటిల్ రెడ్ రైడింగ్ హుడ్... పెద్దదై... చివరకు చీర కట్టుకోవాలని నిర్ణయించుకుంది!"** అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటోషూట్‌ను ప్రముఖ ఫొటోగ్రాఫర్ **స్టోరీస్ బై దీపు** అద్భుతంగా చిత్రీకరించారు. ఫొటోగ్రఫీ, లైటింగ్, ఫ్రేమింగ్, కాస్ట్యూమ్ కలర్ కాంబినేషన్ అన్నీ కలిపి ఈ ఫొటోలను మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. పాయల్ రాధాకృష్ణ షెనోయ్ సినీ ప్రయాణాన్ని కన్నడ చిత్ర పరిశ్రమలో ప్రారంభించింది. ప్రముఖ దర్శకుడు **పి.ఎన్. సత్య** దర్శకత్వంలో తెరకెక్కిన **'బెంగళూరు అండర్‌వరల్డ్'** చిత్రంతో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. తొలి చిత్రంతోనే తన నటన, అందం, ఆత్మవిశ్వాసంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమెకు వరుస అవకాశాలు రావడం ప్రారంభమైంది. కన్నడతో పాటు తెలుగు సహా ఇతర దక్షిణాది భాషల చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటుకుంటోంది. ప్రతి పాత్రలో కొత్తదనాన్ని చూపించే ప్రయత్నం చేస్తూ నటిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటోంది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా సమానంగా ఎంపిక చేసుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. సినిమాలతో పాటు మోడలింగ్ రంగంలోనూ పాయల్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రముఖ డిజైనర్ల కోసం నిర్వహించే ఫ్యాషన్ షోలు, బ్రాండెడ్ ఫొటోషూట్లు, కమర్షియల్ ప్రచార కార్యక్రమాల్లో ఆమె తరచూ పాల్గొంటోంది. సోషల్ మీడియాలో కూడా ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఎప్పటికప్పుడు కొత్త ఫొటోషూట్లు, ఫ్యాషన్ ట్రెండ్స్, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ప్రాంతీయ చిత్ర పరిశ్రమలో వేగంగా ఎదుగుతున్న యువ నటీమణుల్లో పాయల్ రాధాకృష్ణ షెనోయ్ ఒకరిగా గుర్తింపు పొందుతోంది. సంప్రదాయ దుస్తుల్లోనూ, ఆధునిక ఫ్యాషన్‌లోనూ సమానంగా మెప్పించే ఆమె స్టైల్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ తాజా మెరూన్ లెహంగా ఫొటోషూట్ కూడా ఆమె స్టైల్, అభిరుచి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. పండుగలు, ప్రత్యేక వేడుకలు, రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ఇలాంటి లుక్ అద్భుతంగా సరిపోతుందని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అందం, అభినయం, ఫ్యాషన్ సెన్స్, ఆత్మవిశ్వాసం అనే నాలుగు అంశాలను సమపాళ్లలో కలబోసుకుంటూ పాయల్ రాధాకృష్ణ షెనోయ్ తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికరమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే సామర్థ్యం ఉన్న యువ కథానాయికగా ఆమెపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు వ్యక్తమవుతున్నాయి.




# 'కింగ్100'లో టబు విలన్‌గా?


నాగార్జున కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం 'కింగ్100'పై ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జునతో సూపర్‌హిట్ చిత్రాల్లో నటించిన టబు, ఈ సినిమాలో హీరోయిన్‌గా కాకుండా నెగటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

ఇటీవల అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, జూలై 10 తర్వాత 'కింగ్100'కు సంబంధించిన అప్‌డేట్ ఇస్తానని ప్రకటించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

దర్శకుడు రా కార్తీక్ రూపొందిస్తున్న ఈ చిత్రం పేదరికం నుంచి విజయవంతమైన వ్యక్తిగా ఎదిగిన ఓ వ్యక్తి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. తండ్రీకూతుళ్ల మధ్య సాగే భావోద్వేగాలు కథలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ప్రచారం జరుగుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సుష్మిత భట్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు.ప్రస్తుతం టబు పాత్రకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నప్పటికీ, అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. నాగార్జున 100వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో మాత్రం భారీ అంచనాలు నెలకొన్నాయి.



# రాజ్ బి శెట్టి ఎంట్రీతో సియోన్ పై పెరిగిన క్రేజ్




శివకార్తికేయన్ కథానాయకుడిగా రూపొందుతున్న తాజా చిత్రం 'సియోన్' మరోసారి సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొనగా, ఇప్పుడు ప్రముఖ కన్నడ నటుడు, దర్శకుడు రాజ్ బి శెట్టి ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అంతేకాదు, కోలీవుడ్‌లో రాజ్ బి శెట్టికి ఇదే తొలి సినిమా కావడం ఈ అప్‌డేట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.ఇటీవలి కాలంలో దక్షిణాది సినీ పరిశ్రమల మధ్య ఉన్న భాషా సరిహద్దులు క్రమంగా చెరిగిపోతున్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమలకు చెందిన నటీనటులు పరస్పరం ఒకరి సినిమాల్లో మరొకరు నటిస్తూ పాన్‌సౌత్ మార్కెట్‌ను మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. అదే వ్యూహాన్ని అనుసరిస్తూ 'సియోన్' చిత్ర బృందం కూడా వివిధ భాషల్లో గుర్తింపు పొందిన నటులను ఎంపిక చేస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా దక్షిణాది ప్రేక్షకులందరినీ ఆకట్టుకునేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. శివకార్తికేయన్ కెరీర్ పరంగా కూడా 'సియోన్'కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. గత చిత్రాల ఫలితాల తర్వాత బాక్సాఫీస్ వద్ద బలమైన విజయాన్ని అందుకోవాల్సిన పరిస్థితి ఆయనకు ఉంది. అలాంటి సమయంలో గ్రామీణ నేపథ్యం, స్థానిక భావోద్వేగాలతో కూడిన కథను ఎంపిక చేసుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. గతంలో ఇలాంటి కథలతో ఆయన సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటున్న అభిమానులు, 'సియోన్' కూడా అదే స్థాయిలో విజయాన్ని అందిస్తుందనే ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎక్కువ చర్చకు కారణమవుతున్న అంశం రాజ్ బి శెట్టి ఈ సినిమాలో నటించడమే. నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, సాధారణంగా కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలనే ఎంపిక చేస్తారనే పేరు సంపాదించుకున్నారు. అందువల్ల ఆయన ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో 'సియోన్' కథలో బలమైన అంశాలు ఉండొచ్చనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. అయితే చిత్ర కథపై ఇప్పటివరకు మేకర్స్ ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. సినిమా ప్రకటించినప్పటి నుంచి విడుదలవుతున్న ప్రతి అప్‌డేట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. నటీనటుల ఎంపిక నుంచి సాంకేతిక బృందం వరకు ప్రతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు రాజ్ బి శెట్టి చేరికతో ఈ ప్రాజెక్ట్‌పై చర్చలు మరింత ఊపందుకున్నాయి. బలమైన కథ, విభిన్న నటీనటుల కలయిక, పాన్‌సౌత్ స్థాయిలో రూపొందుతున్న క్యాస్టింగ్, అలాగే శివకార్తికేయన్ కెరీర్‌లో కీలక దశలో వస్తున్న సినిమా కావడంతో 'సియోన్' ఇప్పటికే అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఈ సినిమా అంచనాలను ఎంతవరకు అందుకుంటుందో అన్న ఆసక్తి ప్రేక్షకులతో పాటు సినీ, ట్రేడ్ వర్గాల్లోనూ నెలకొంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034